# మొద్దబ్బాయి తీర్పు

రావి-ఎన్-అవధాని

తెల్లారేసరికి ఊరంతా గుప్పుమంది. చిన్నా పెద్దా, ఆడా, మగ ఎవరి నోట విన్నా అదే మాట! ఒకటే గుసగుస!

"దరమయ్య గోరి బొట్టి సుగునమ్మగోరి పెల్లి ఆగిపోనాది!"

గ్రామ ప్రజలు అనుకోవడంలో తప్పేమీ లేదు. తాంబూలాలు మార్చుకొని పెళ్లికి ముహూర్తం నిర్ణయించుకోవాలనుకున్న రోజున -

'మీ సంబంధం మాకు వద్ద'ని పెళ్లికొడుకు తండ్రి ధర్మయ్య గారికి కబురు పంపాడు.

అదేమైనా సామాన్యమైన విషయమా? ధర్మయ్య గారికి ఎంత అవమానం? ఆయన సామాన్యమైన వ్యక్తి కారు. ఎంతో గౌరవం, పలుకుబడి, అంగబలం, అర్థబలం ఉన్న మనిషి. సిరిపురంలో ఆయనకు వంద ఎకరాల మాగాణి, బత్తాయి, అరటి, మామిడి, కొబ్బరి తోటలున్నాయి.

విశాలమైన ఆవరణలో అధునాతన సౌకర్యాలతో ఇల్లుంది. ఇంటి చుట్టూ ఎత్తయిన ప్రహరీగోడ. ఇంటి ఆవరణలో ఒకపక్క నాలుగు ధాన్యం కొట్లూ, మరొకవైపు రేకులషెడ్డు. అందులో ట్రాక్టర్, వ్యవసాయపు పనిముట్లూ. ఇంటిముందు ఎత్తయిన విశాలమైన అరుగులు. వాటి మీద ఒక పడక కుర్చీ, దాని పక్కనే పాతిక ప్లాస్టిక్ కుర్చీలు ఉంటాయి.

ధర్మయ్యగారు ఎప్పుడూ ఆ పడక కుర్చీలో కూర్చునే వచ్చిన వారితో సంప్రదింపులు జరుపుతుంటారు. తగవులు పరిష్కరిస్తుంటారు. న్యాయవిచారణ చేస్తుంటారు. చుట్టుపక్కల గ్రామ ప్రజలకు అది ధర్మపీఠం. ధర్మయ్యగారి తీర్పుకు అందరూ కట్టుబడి ఉంటారు. ఆయన ఉన్నత విద్యను అభ్యసించిన మేధావి.

అన్నపూర్ణమ్మ ధర్మయ్యగారి ఇల్లాలు. ఆయనకు తగిన భార్య. దంపతులు ఇద్దరూ దానధర్మాలు చెయ్యడంలో ఒకరిని మించినవారొకరు. చుట్టు ప్రక్కలగ్రామాల్లో ఏ ఇంట వివాహం జరిగినా ఆడపిల్లకి తాళిబొట్టూ, నూతన వస్త్రాలు - పసుపు కుంకుమలు ఇచ్చి దీవించడం ధర్మయ్యగారికి అలవాటు. వారి దీవెనలు పొందిన వారంతా సుఖసంతోషాలతో, పిల్లాపాపలతో సిరిసంపదలతో ఆనందంగా ఉన్నారు. ధర్మయ్యగారి ఒక్కగానొక్క కూతురు సుగుణమ్మ. బి.ఏ. పాసయింది. రూపసి. వినయ విధేయతలు ఉన్న పిల్ల.

ఒక రోజు పడమటలంక లక్కవరం నుండి లక్ష్మీపతి, అతని బావమరిది గోపాలం ధర్మయ్యగారి ఇంటికి వచ్చి తమను పరిచయం చేసుకున్నారు. 'మా అబ్బాయి వినోద్ ఇంజనీర్‌గా విజయవాడలో జాబ్ చేస్తున్నాడు. వాడి ఫోటో, జాతకం, వివరాలు ఇవిగో! మీ అమ్మాయిని మా అబ్బాయికి చేసుకుందామని అడగడానికి వచ్చాం' అన్నాడు లక్ష్మీపతి.

'మా గ్రామంలో వినోద్ పేర పది ఎకరాల

కొబ్బరితోట, విజయవాడలో ఇల్లు ఉన్నాయి' అన్నాడు గోపాలం.

ధర్మయ్యగారు చిరునవ్వు నవ్వి, 'విషయం మా వాళ్లతో చెప్పి మీకు త్వరలో తెలియపరుస్తాను' అన్నారు.

సంబంధం విషయం భార్యతో చెప్పారు.

'ఇంతవరకూ మనవాళ్లెవ్వరూ పడమటి వాళ్లతో సంబంధం చెయ్యలేదు. వాళ్ల ఆచారాలు, పద్ధతులు, ఆహారపు అలవాట్లూ వేరు అని విన్నాను. మన అమ్మాయి వాళ్లతో ఇమడగలదా? మనకి ఉన్న ఒక్క అమ్మాయిని అంత దూరం ఇవ్వాలా?' అన్నారు అన్నపూర్ణమ్మ గారు.

'ఈ కాలంలో ఆడపిల్లలు విదేశాలకు, చంద్రమండలానికీ వెళ్లిరాగలుగుతున్నారు! తూర్పు, పడమర, దూరం, దగ్గర ఏమిటి?' అని ఆమెకు నచ్చచెప్పారు ధర్మయ్యగారు,



బంధువులు. సిద్ధాంతి గారికి కబురుపంపి అమ్మాయి, అబ్బాయి జాతకాలు ఇచ్చి చూడమన్నారు. ఆయన చూసి 'నప్పుతాయి' అన్నారు.

ముకుందం మాష్టార్ని లక్కవరం, విజయవాడ వెళ్లి వాళ్ల వివరాలు సేకరించుకురమ్మన్నారు ధర్మయ్యగారు. ముకుందంగారు హైస్కూల్లో ఇంగ్లీషు టీచరు, కార్యశీలి. అతను లక్కవరం, విజయవాడ వెళ్లి వాళ్ల వివరాలన్నీ రహస్యంగా సేకరించుకొచ్చాడు.

'కుర్రాడు యోగ్యుడు, బుద్ధిమంతుడు, చెడు వ్యసనాలు లేవు. మంచి పర్సనాల్టీ, గవర్నమెంట్ జాబు' అని వినోద్ వివరాలు, లక్ష్మీపతిగారి స్థితిగతులు, కుటుంబ వివరాలు చెప్పాడు.

ధర్మయ్యగారు పిల్లను చూసుకుంటానికి రమ్మనమని లక్ష్మీపతిగారికి కబురు పంపారు.

లక్ష్మీపతిగారు కుటుంబ సభ్యులతోవచ్చి పిల్లను చూసారు. అమ్మాయి, అబ్బాయి ఇష్టపడ్డారు.

'తాంబూలాలు పుచ్చుకొని పెళ్లికి ముహూర్తం పెట్టించుదాం!' అన్నారు ధర్మయ్యగారు.

'వారం రోజుల్లో మా గ్రామంలో మా కులదేవత నూకాలమ్మ జాతర ఉంది. అది అయిన తరువాత మంచిరోజున మా బంధువులు అందర్నీ పిలిచి పెద్దల సమక్షంలో తాంబూలాలు పుచ్చుకొని, పెళ్లికి ముహూర్తం పెట్టిద్దాం'మన్నాడు లక్ష్మీపతి.

ధర్మయ్యగారు అందుకు అంగీకరించారు. జాతరకు మీరందరూ రావాలని ఆహ్వానించాడు లక్ష్మీపతి. అయితే జాతరకి ధర్మయ్యగారు వెళ్లలేదు. జాతరయిన తరువాత 'కారణాంతరాల వల్ల మీ అమ్మాయిని మా అబ్బాయికి చేసుకోవడం లేదు' అని లక్ష్మీపతి కబురు పంపాడు ధర్మయ్యగారికి.

వార్త విన్న ధర్మయ్యగారు పైకి ఏమీ అనకపోయినా అతని బంధువులు, ఊర్లో పెద్దలూ కోపంతో రెచ్చిపోయారు.

'ఏరికోరి తమంత తాము వచ్చి మీతో వియ్యమందుతామని చెప్పి ఈ విధంగా అవమానిస్తాడా? వాడెంత? వాడి బతుకెంత? జీవితాలతో చెలగాటం ఆడతాడా? ఇలాంటి వాడిని ఊరికే వదిలెయ్యకూడదు. తగిన గుణపాఠం చెప్పాలి!' అన్నారు.

ధర్మయ్య గారికి దానధర్మాలు చెయ్యడం తెలుసు కాని... కోపం, పగ, ఈర్ష్య, ద్వేషం తెలియదు.

'బురదలో బెడ్డ విసిరితే మన గుడ్డలే ఖరాబవుతాయి! విషయం రాద్ధాంతం చెయ్యకండి' అన్నారు.


ధర్మయ్యగారు మౌనం వహించినా అతని బంధువులు, ఊర్లో పెద్దలూ ఊరుకోలేదు. గ్రామంలో ఒకరి కష్టం ఊరందరి కష్టం. ఒకరి సంతోషం ఊరందరి పండుగ.

'దరమయ్య గోరి ఈ కట్టానికి కారనం ఆ ముకుందంగోరేనని' అతని వద్దకు వెళ్లారు.

నువ్వు సదూకున్నోడివి! తెలివిగలోడివని నమ్మి నీకు పని అప్పగిత్తే దరమయ్య గోర్ని దగాసేసి గుమ్మీలదించుతావా? వారికీ తలొంపులు తెస్తావా? అని దూషించారు.

ఇది జరిగిన మూడో రోజు సాయంత్రం గ్రామ పెద్దలందర్నీ ధర్మయ్యగారింటి వద్ద సమావేశపరచి పంచాయితీ పెట్టించాడు ముకుందం మాష్టారు.

'గ్రామ ప్రజలందరికీ వందనాలు. ధర్మయ్యగారికి నాపైగల నమ్మకం, విశ్వాసం వల్ల నాకొక చిన్న పని అప్పగించారు. ఆ పనిని నేను సక్రమంగా నెరవేర్చాను. వారిపై నాకు అపా




రమైన గౌరవము, భక్తి పూజాభావం ఉన్నాయి. కలలో కూడా వారికి నేను కీడు, ఆపద తల పెట్టను'.

'కాగా గ్రామ ప్రజలందరికీ నామీద అపోహతో దురభిప్రాయం కలిగింది. గ్రామవాసులంతా ఒకే కుటుంబ సభ్యులవలె అన్యోన్యంగా ఉన్నప్పుడు అపోహలకు, అనుమానాలకూ చోటుండకూడదు. అందుకే ఈ ధర్మపీఠం ముందు మీకు నిజానిజాలు తెలియజేయాలనుకున్నా!'

'ఇతని పేరు పోతరాజు. గణాచారి: జరిగిందేమిటో మీకు చెప్తాడు' అన్నాడు ముకుందం.

'అందరికీ దండాలండి! నాపేరు పోతరాజండి. మాది లక్కవరం. నాను నూకాలమ్మ గుడిలో పూజారిని. లచ్మీపతిగోరు గుడి దరమకరతలండి! జాతర తొల్నాడు అల్లాబాబు బూసయ్యగోరు నాకాడకొచ్చి నా సేతిల అయిదొందలెట్టి సిన్న పని సెయ్యమని సాయం కోరారండి! జాతరల లక్ష్మీపతిగోరు గుడిల అమ్మోరి మొక్కుబడి సేసేందుకొత్తారుట! ఆటయాంల నువు పూనకంసేసి ఆరి బొట్టేడు ఇనోదుబాబు పెల్లి ఆపుసెయ్యాలని సెప్పాలి. నేకుంటే ఆ బాబు పేనానికే ముప్పు – అమ్మోరి పలుకని నమ్మ సెప్పాలని బలవంతంసేసేరు. నువు కాదని మెడ్తైతే మీదటికి నూకాలమ్మ గుడిల కొత్త పూజారుంటాడు అని నన్ను బెదిరించారు. నాను బయపడి ఆరుసెప్పిన పనిచేసేను. లచ్మీపతి గోరు నాపూనకంల మాటలు నమ్మేరు! నా తప్పిదం తమరు చమించాల' అన్నాడు చేతులు జోడించి.

'బావూ నాను సేసిన పాడు పనికి కంటిన కునుకు నేదండి. అబద్ధవాడినందుకు నాలిక మీద వాతెట్టుకున్నానండి. సేసినపాపం సెపితే పోతాదటండి!' అని నాలిక చూపించాడు.

భూషయ్య ముఖం నల్లబడింది. భూషయ్య ఇంత దారుణం చేస్తాడా? అని జనాలు కోపంతో రెచ్చిపోయారు.

పది సంవత్సరాల క్రితం భూషయ్య కట్టుబట్టలతో భార్యని, కొడుకునీ వెంటబెట్టుకొని ధర్మయ్యగారి వద్దకు వచ్చాడు.

'తవకాడ ఎందరో పనోళ్లున్నారు. మాకు కూడు పెడితే మీ దివానంల పనిసేసుకు బతుకుతాం. తవరు ఏపని సెప్పినా సేస్తాం. పొలం పని, గొడ్ల పని, పాచి పని ఏదైనా చేస్తాం' అన్నాడు.

ధర్మయ్యగారు అతడు తన భార్యకు దూరపు బంధువు అని తెలుసుకున్నారు. అందువల్ల అతడిని తన వద్ద పనివాడుగా పెట్టుకుందికి అతని మనస్సు అంగీకరించలేదు.

'చూడు భూషయ్యా! నీకు మూడు ఎకరాల పొలం, వ్యవసాయపు పనిముట్లూ వగైరా ఇస్తాను. నువ్వు సేద్యం చేసుకొని అనుభవించు. నువ్వు ఉండేందుకు పొలంగట్టున ఇల్లు ఏర్పాటు చేస్తాను' అని వాడిని అన్నివిధాలా ఆదుకున్నారు.

అన్నపూర్ణమ్మగారు కూడా వారికి ఎన్నో విధాల సహాయం చేసారు. అటువంటి వారికి భూషయ్య ఇంతద్రోహం చేస్తాడని ఎవరూ ఊహించలేదు.

"ఏం భూషయ్యా! ఎందుకు చేసేవు ఈ పాడుపని?" అని అడిగేరు గ్రామపెద్దలు.

"ఆడేటి సెవతాడండీ! ఆడు సెప్పడండి! నాను సెవతాను" అంటూ జనాల మధ్యనుంచి ముందు కొచ్చింది భూషయ్య భార్య గంగమ్మ.

"బావూ! ఈడు నాగుపావు నాటోడండి! పావుకు పాలు పోసినోరినే కాటేత్తాదండి! అది దాని సొబావమండి! ఈడూ అంతేనండి"

"మాది ముంగినాపల్లి అగ్గురారవండి! మా కన్నోరు నాకు నా లగ్గవప్పుడు పాతిక కాసులు బంగారం, అయిదెకరాల పొలం ఇచ్చారండి. ఈడి బాగం పొలం పదెకరాలు, పెంకుటిల్లూ! సీట్లాటల మరి ఈడు దరమరాజంతటోడండి! మొత్తం ఆర్పేసినాక ఊర్నుండి తరిమేస్తే కట్టు గుడ్డలతో యీడకొచ్చినావండి! దరమయ్యగోరు దయ సూపేరు. నేకుంటే నూయో గోయో సూసుకుందువండి!"

"ఈడికి ఇసవోసం నేదండి! పనికి వాల్లొంగ దండి! పలకా బలపం అట్టుకునే వొయసుల మా బొట్టెడు పార, పలుగు, నాగలీ అట్టుకొన్నా యీడికి ఇసారం, కనికరం నేదండి! మావు ఎండల వోనల సేకరీ సేస్తుంటే ఈడు ఊర్లంట తిరుగుడండి!"

"సుగునమ్మ గోరి పెల్లి సంబంధం మాటిన గానే ఈడి బుర్రల సెడ్డాలోసన సేసినాడండి. అయినోల్లం, బందుగులం... మన ఎంకటేసుకి సుగునమ్మని సేసుకోమని దరమయ్యా గోరిని అడిగితె ఎట్టాగుంటా"దన్నాడు.

"సెప్పిచ్చుక కొడతారు! నోటి మీద వోత లెడతారు పల్లకుండని" కసిరినానండి. "ఈడి బుర్రల ఇట్టాంటి సెడ్డాలోసన ఎట్టా గొచ్చినాది దేవుడాని బెగిలి పోనానండి!. నాను పైసా పైసా కూడెట్టిన సొమ్ము ఎనిమిదొందలు దొంగసాటున అట్టుకుపోయి యాడీ పాపిస్టి పని సేసుకొచ్చాడండీ!" అంది ఎంతో ఆవేదనతో కళ్లొత్తుకుంటూ.

ధర్మయ్యగారు చిరునవ్వు నవ్వి "గంగమ్మా! నీ పెనిమిటికి శిక్ష ఏమిటో తీర్పు నువ్వే చెప్పు!" అన్నారు. ధర్మయ్యగారి మాటలకు అంతా ఆశ్చర్యపోయారు.

"బాబుగోరూ! ఈడు సేసిన నేరానికి యీడితో బాటు నానూ ముద్దాయినే గదేటండీ! ముద్దాయిని నువు సేసిన నేరానికి శిచ్చేటో నువ్వే సెప్పు! అని తవరు సెలవిచ్చేరు. తవరి ఆలోచన బోదవనేదు గానండి నా తీరుపు..." అని గంగమ్మ అందరి ముందూ తన మెడలోని తాళి తీసి, భర్త భూషయ్య ముఖాన కొట్టి మారు మాట్లాడకుండా వెళ్లిపోయింది.